# అమ్మ కోసం



పినిశెట్టి శ్రీనివాసరావు

నాన్న పోయి ఈ రోజుకు పదకొండో రోజు.

పెద్ద ఖర్మకు బంధువర్గం- ఇరుగు పొరుగు అంతా వచ్చారు.

ఉనం భోజనానికి ఏర్పాట్లు పెద్ద ఎత్తునే జరిగాయి.

షామియానాలు- టేబిల్ మీల్సు- పాతికకోళ్లు- ఇరవై కిలోల మాంసం. పలావు భోజనం.

ఇదంతా చనిపోయిన నాన్న ఆత్మకు శాంతి కలగాలనే వింత ఆచారం చచ్చిపోయిన మనిషి ఆత్మ శాంతికోసం మరికొన్ని జీవాల హత్య.

కొందరు పెద్దలు భోజనానికి ముందు మందు పుచ్చుకొచ్చారు. నాగరిక ప్రపంచం.

విషాదచ్ఛాయలు అలుముకున్న వాతావర ణంలో సంతోషం పండించుకుందామని వచ్చారు. సభ్యత తెలీని కుసంస్కారులు, అనాగరికులు.

"బాబాయికి కోపం వచ్చిందట." ఎవరో నల్గురు కూడి చెప్పుకుంటున్నారు.

"ఎందుకు? ఎందుకు?... ఏమైంది... ఏమైంది?" కారణం తెలుసుకోవాలన్న కుతూహలం కొందరిలో.

"కోడికూర సరిగ్గా వడ్డించలేదట ఆయనకు. రెండోసారి కావాలా అని కూడా ఎవ్వరూ అడగలేదట"

ఇదీ కారణం బాబాయి కోపానికి.

అందుకే కాబోలు భోజనానంతరం ఎక్కడో మూలగా వెళ్ళి కూర్చున్నాడు ఎవ్వరితో మాట్లాడకుండా.

సొంత తమ్ముడు కాకపోయినా, నాన్నగారికి తమ్ముడు వరసవుతాడు. దూరపు చుట్టరికం.

తినటానికి- కోపం తెచ్చుకోటానికి సమయమా అది?

అందుకే కాబోలు 'వయసునుబట్టి కాదు పెద్దరికం నిర్ణయించేది వాళ్ళ బుద్ధుల్ని బట్టిగాని' అన్నారు.

మరో బంధువు... ఏదో బీరకాయ పీచు సంబంధం అతనూ అలిగి కూర్చున్నాడట. కారణం- ఆయన్ని భోజనానికి రమ్మని ఎవ్వరూ చెయ్యి పట్టుకుని డైనింగ్ టేబుల్ వరకు తీసుకురాలేదట

ఆయనేం నడవలేని మనిషి కాదు. ముసలాడు కాదు.

కాకపోతే 'ఇగో' రోగంతో బాధపడుతున్న మనిషి.

పెద్ద హోదాగల ఉద్యోగం వెలగబెట్టి ఈ మధ్యనే రిటైరయ్యాడు. ఆ దర్జా రిటైరయ్యాక కూడ మైంటైన్ చెయ్యాలన్న వెర్రితనం.

దేనికైనా సమయం వుంది. సందర్భం వుంది. అవి మర్చిపోయి ప్రవర్తించే వాళ్ళనేమనాలి?

ద్విపాద పశువులు.

ఈ భోజనాల హడావుడిలో అమ్మనుగురించి ఎవ్వరూ పట్టించుకున్నట్లు లేదు.

ఏడ్చి ఏడ్చి వుందేమో అమ్మ ముఖం పీక్కుపోయింది. బొట్టులేని ఆమె ముఖం కళావిహీనమైపోయింది. నాన్నా వున్నప్పుడు నిండు ముత్తయిదువులా వుండే అమ్మ ఇప్పుడు ఎండిన మోడులా తయారైంది.

ప్రొద్దున్ననుంచి పచ్చి మంచినీళ్ళు అయినా ముట్టుకోలేదట అమ్మ.

పెద్దక్కను పిల్చి అమ్మకు భోజనం పంపించమని చెప్పాను.

"ఆమె ఏమీ తిననంటుంది. గంటనుంచి చెప్పి చూస్తున్నాం. ఎవరు చెప్పినా వినటం లేదు" అంది అక్క.

నాకెందుకో కళ్ళెమ్మట నీళ్లు అప్రయత్నంగా వచ్చేసాయి. ఎంత కంట్రోలు చేసుకుందామనుకున్నా ఆగడం లేదు.

ప్రక్కకు తిరిగి రుమాలుతో కళ్ళు తుడుచుకున్నాను. నా గుండెల్లో చెప్పలేని బాధ.

నా చిన్నతనం గుర్తొచ్చింది.

అమ్మకు మేం పదిమంది సంతానం. ఆ రోజుల్లో ఇదేమంత వింత కాదు. దాదాపుగా అందరివీ ఒకటి రెండు తేడాతో ఇంత పెద్ద కుటుంబాలే. ఎంత ఎక్కువ మంది పిల్లల్నికంటే అంత గొప్ప. అయితే వాళ్ళ ఆరోగ్యాలు, శరీక దారుఢ్యం, తినే తిండి అటువంటివి.

నాన్న ఎంత సంపాదిస్తే మాత్రం అది ఏ మూలకి? ఒక్కరి సంపాదన- పదమంది పోషణ.

ప్రొద్దున్న ఐదింటికి వెలిగించిన పొయ్యి మధ్యాహ్నం పన్నెండువరకూ మండుతూనే వుండేది. కాఫీలు- టిఫిన్లు- ఆ తర్వాత అన్నం- కూరలు. ఇవన్నీ అయ్యేంతవరకు అమ్మ పొయ్యి ముందునుంచి లేచేది కాదు.

ఇవన్నీ అయ్యి అమ్మ స్నానం చేసి వచ్చి దేవుడికి దణ్ణం పెట్టుకుందామనుకొనేటప్పటికి "అమ్మా ఆకలి- అమ్మా అన్నం" అంటూ ఎవరో ఒకళ్ళు రాగాలాపన మొదలుపెట్టేవారు.

'ఇదిగో వచ్చేస్తున్నా' అంటూ పెట్టుకుంటున్న దణ్ణం ఆపేసి, పీటలేసి, కంచాలు పెట్టి, మంచినీళ్లు పెట్టి. మొదటి బేచ్‌కి, అంటే నలుగురికో- ఐదుగురికో ఒకేసారి అన్నం వడ్డించేది. పిల్లలు తింటున్నంతసేపు అక్కడే కూర్చుని చూస్తుండేది.

ఆ తర్వాత రెండో బేచ్. వీళ్ళ భోజనాలయ్యేటప్పటికి టైము వొంటిగంటయ్యేది. అప్పుడు నాన్నగారు ఆఫీసునుంచి వచ్చే టైము. నాన్నగారు

**అమ్మకు మేం పదిమంది సంతానం. ఆరోజుల్లో ఇదేమంత వింతకాదు దాదాపు అందరివీ ఒకటి రెండు తేడాతో ఇంత పెద్ద కుటుంబాలే! ఎంత ఎక్కువమంది పిల్లల్ని కంటే అంత గొప్ప. వాళ్ళ ఆరోగ్యాలు వేరు...**

భోజనంచేసి ఆఫీసుకు వెళ్ళిపోతారు కనుక, ఆయన వచ్చేటప్పటికి, కూర్చునే పీట, ముందు ముక్కాలిపీట, దానిమీద అన్నం తినే వెండిపళ్ళెం, ప్రక్కనే రాగి చెంబులో నీళ్ళు, వెండిగ్లాసు, దండెంమీద తువ్వాలు అన్నీ సిద్ధంగా వుండేవి నాన్నగారు రావటమేమిటి, ప్యాంటు, షర్టు తీసేసి, పంచె కట్టుకుని, కాళ్ళుచేతులు ముఖం కడుక్కుని భోజనానికి కూర్చునేవాళ్లు.

అమ్మదిగ్గరుండి వంటకాలన్నీ వడ్డిస్తుండేది.

నాన్నగారు సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేటప్పుడు ఏమేం కొని తీసుకురావాలో అప్పుడే చెప్తుండేది అమ్మ.

అన్నం తింటూనే, నాన్నగారు ఊ కొట్టూ తలూపేవారు.

అమ్మ చెప్పేవి తేవటానికే కాబోలు. బైటకు వెళ్ళేటప్పుదెప్పుడూ నాన్నగారి చేతిలో సంచి వుండేది. వెళ్ళేటప్పుడు ఖాళీసంచి, వచ్చేటప్పుడు నిండు సంచి.

భోజనం అయ్యాక ఒక అరగంటసేపు నడుం వాల్చేవారు నాన్న.

ఆ టైములో అమ్మ నన్ను పిల్చేది.

"ఏరా వాసూ ఇప్పుడైనా అన్నానికి వస్తావా?" అని.


"ఎందుకు రాను? పద ఇద్దరం భోంచేద్దాం" అనే వాడిని.

"నాతో నీకెక్కడవుతుందిలే. ముందు నువ్వు కానీ. నేను తర్వాత తింటాను" అంటూ నాకు ఘుందుగా భోజనం వడ్డించేది అమ్మ.

అమ్మ నాతో ఎందుకు భోజనం చేయదో నాకు తెలుసు. అందరికీ వడ్డించాక ఆమెకు మిగిలేది ఒక్క అన్నమే. గిన్నెల కడుగున అంటుకున్న మాడుపులో ఇంత అన్నం పడేసి అది కలుపుకు తినేది. నాతో కూర్చుంటే 'నువ్వు కూర పెట్టుకోలేదే, పప్పు వడ్డించుకోలేదే' అని ఆరా తీస్తానని భయం.

ఇంతమందికి వండి వడ్డించి, అమ్మ అడుగు బొడుగు మిగిలిందేదో తింటుందన్న విషయం తెలిసిన దగ్గర్నుంచి నేను ఇక అమ్మ ఏం పెట్టినా పూర్తిగా తినకూడదనే నిర్ణయాని కొచ్చేశాను. నాకు పెట్టిన దాంట్లో సగమే తినటం అలవాటు చేసుకున్నాను. మిగిలిన సగం అమ్మకోసం తీసి ప్రక్కన పెట్టటం అలవాటైపోయింది. ఈ అనుమానమే. నేను ఎవరింటికి వెళ్ళినా వాళ్ళు పెట్టింది తినేముందు వాళ్ళకు ఉందోలేదో అన్న ఆలోచన వచ్చి, చూసిచూసి వడ్డించుకోవటం అలవాటు చేసింది

అమ్మ భోజనం అయ్యేటప్పటికి రెండయ్యేది. పడక కుర్చీలో పదినిముషాలు నడుం వాల్చి,



మళ్ళీ పనిలో మునిగిపోయేది అమ్మ. బియ్యం ఏరటమో, పప్పులు బాగుచేసుకోవటమో, రవ్వ-పిండి వంటివి శుభ్రంచేసుకోవటమో, పిల్లలు తినటానికి జంతికలు- కారప్పూస, కజ్జికాయలు వంటివి చేయటమో చేస్తూండేది. నాల్గు-ఐదు గంటల ప్రాంతంలో అందరికీ టీలు కాసిపోసేది. తర్వాత రాత్రి భోజనానికి వంటలు. అన్నీ అయ్యి రాత్రి పడుకునేటప్పటికి రాత్రి పది అవ్వాల్సిందే అప్పటికీ అమ్మకు రెస్టుండేది కాదు. నాన్నకు కాళ్ళుపడ్తూ కూర్చొనేది. నాన్న ఆఫీసుక్కాని, బజారుకేకాని నడిచేవెళ్ళేవాడు. చేతిలో ఎంత బరువుమోస్తున్న బస్సుకాని, రిక్షాకాని ఎక్కేవాడు కాదు. దానికిపోసే పావలానో-అర్థో పెడ్తే, ఏ కాయగూరలైనా వస్తాయనే ఉద్దేశ్యం. ఫలితం నాన్నకు కాళ్ళనొప్పులు. అమ్మకు నాన్న కాళ్ళు పట్టేపని. నాన్నకు బైటపని. అమ్మకు ఇంటి పని. ఒకటీ-అర పనులు తప్పిస్తే పిల్లలకేం పనులు చెప్పేవారు కాదు ఎందుమరి. కష్ట జీవులు. ఇంతమంది పిల్లల్ని ఎందుకు కన్నట్లు? ఏం సుఖపడుతున్నట్లు ? ప్రొద్దున్న లేచింది మొదలు పని-పని-పని, గానుగెద్దులా సంసార భారాన్ని లాగలేక లాక్కొస్తున్నారు.

వాళ్ళ శరీరాలకు విశ్రాంతి ఏది ? వాళ్ళ మనసులకు శాంతి ఏది ? అయినాసరే, అమ్మా-నాన్నా ఒకరిమీద ఒకరు విసుక్కున్నట్లుకాని, తిట్టుకున్నట్లుకాని నాకు గుర్తులేదు.

పండుగలొచ్చాయంటే సరేసరి. మధ్యాహ్నం రెండు-మూడు అయ్యేదాకా అమ్మ పొయ్యిముందు కూర్చుని పిండివంటలు చేస్తూనే వుండేది. అదీ పండగ సుఖం ఆమెకు. పిల్లలందరకూ ఆమె చేసిన పిండివంటలు తింటూ సంతోషంగా వున్నా, నాకు మాత్రం పొయ్యిముందు అగ్నికి ఆహుతి అయిపోతున్నట్లున్న అమ్మనుచూస్తే ఎందుకొచ్చిన పండుగరా దేవుడా అనిపించేది. చేసిచేసి అలసిపోయి, ఆ పూట తిండికూడా మానేసి మంచం మీద పడిపోయేది పండగపూట ఉపవాసం.

"మా అందరికీ పిండివంటలు చేసిపెట్టి నువ్వే పస్తు పడుకున్నావా ? పద కొంచెం తిని లేద్దువు గాని ?" అని ఉగాది పండగప్పుడు తనంటే అమ్మే మంది ?

"ఇప్పుడేం తినాలని లేదురా అబ్బాయ్. అయినా మీరంతా తింటే నేను తిన్నట్లు కాదూ ? పిల్లలు తింటే తల్లి కడుపు నిండినట్లే. అయినా నేను తిన్నానో లేదో అని ఎప్పుడూ చూసుకుంటావ్. ఎందుకురా నామీద నీకంత అనుమానం పిచ్చిసన్నాసీ" అంది.

"నువ్వు మా అందరికీ ఫలాలనిచ్చే తల్లి వృక్షానివి. నిన్ను ఎండబెడ్తే మాకు ఫలాలెలా ఇస్తావ్ ? నీలో శక్తివుంటేనే నీ పిల్లలకు ఇంత చేసి పెట్టగలవ్" అని పైకి అనకపోయినా నేను నాలో అనుకునేదాన్ని

ఈ రోజు అమ్మ పస్తుందంటే మళ్ళీ ఆ చిన్ననాటి రోజులు గుర్తొస్తున్నాయి. ఇంతకాలం మా అందరికీ ఎన్నో సేవలు చేసింది. ఇక ఆమెకు సేవలుచేసి తరించవలసిన సమయం ఆసన్నమైంది.

ఈ సమయంలో అమ్మ దగ్గర కెళ్ళి భోజనం చేయమని అడిగే ధైర్యం నాకు లేదు. అందుకే అమ్మకుతోడుగా నేను ఈపూట భోజనంచేయకూడదనే నిశ్చయించుకున్నాను.

అమ్మకున్న పదమంది సంతానంలో ముగ్గురమే మగాళ్ళం. పెద్దవాడు 'కృష్ణ' అన్నయ్య నేను రెండోవాడ్ని. తమ్ముడు 'శేఖర్'.

నాన్న పోయాక అమ్మను ఎక్కడుంచాలన్నది ఈ రోజు చర్చనీయాంశం.



## దొంగలు

ప్రసిద్ధ కాలిఫోర్నియా వారపత్రిక క్రిస్మస్ ప్రత్యేక సంచికలో అన్ని పేజీల నిండా వాణిజ్య ప్రకటనలే వేసింది. సంపాదకీయంలో ఇలా రాసింది

"మా కార్యాలయంలో దొంగలు ప్రవేశించి రచనలు, చిత్రాలు, రిపోర్టులు అన్నీ దొంగిలించుకుపోవటంవల్ల ఈ సంచిక ఇలా వెలువడింది. పాఠకులు గమనించ ప్రార్థన.

-డి. సత్యమూర్తి (అమలాపురం)

పిల్లలు పుట్టిన దగ్గర్నుంచి, వాళ్లు పెరిగి పెద్దయి, ప్రయోజకులై, పెళ్ళిళ్లై ఒకింటివాళ్ళయ్యేంతవరకూ, వాళ్ళ బాగోగులు చూసి, వాళ్ళ అవసరాలు తీర్చి, సేవలు చేస్తారు తల్లిదండ్రులు. ప్రతిఫలం కాంక్షించని నిస్వార్థసేవ తల్లిదండ్రులు చేసేది. కానీ వృద్ధాప్యంలో వున్న తల్లిదండ్రులకు, మనిషి తోడు-నీడ అవసరం వచ్చేటప్పటికి, ఈ సంతానమే తమ బాధ్యతల నుండి ఎవరికివారే తప్పించుకోవాలని చూడటానికి కారణం? తమకంటూ ఒక కుటుంబం, బాధ్యతలు ఏర్పడ్డాయి కనుక, వాటితోపాటు ఇంకా ఈ ముసలివాళ్ళ బాధ్యతలు ఎందుకు తీసుకోవాలనా? తమకే మరొకరో-ఇద్దరో పిల్లలుంటే వాళ్ళను వదిలేస్తారా? కన్న బిడ్డలకంటే తక్కువా కన్నవాళ్లు? పెద్దవాళ్ళ అవసరం తీరిపోయిందికదాని, వాళ్ళను నిర్లక్ష్యం చేయటం న్యాయమా? ఒడ్డు చేరాక తెప్ప తగలేయటం అంటే ఇది కాదా? రేపొద్దున్న తమకూ ఈ పరిస్థితే సంభవిస్తే?


"అమ్మ ఎక్కడకూ రానంటుంది. ఇక్కడే వుంటుందట. అందుకని నాదొక ప్రపోజల్." ముందుగా అన్నయ్యే అన్నాడు.

"ఏవిటీ" అన్నట్లుగా చూశాం నేను-తమ్ముడు.

"ఎలాగూ ఒక పోర్షన్ తాలూకు అద్దె రెండు వందలొస్తుంది కనుక, మనం ముగ్గురం నెలకు తలా వంద అమ్మకు పంపిస్తే- మొత్తం ఐదొందల్తో ఆమె ఒక్కర్తి సుఖంగా బ్రతకొచ్చు" అన్నాడు అన్నయ్య.

"అది కాదన్నయ్యా. ఆడ మనిషి-ఆమె ఒక్కర్తినే వదిలేస్తే-ఏ క్షణానికి ఏం అవసరమొస్తుందో? నాన్న తప్పనిస్తే, ఆమె ఎప్పుడూ బైటకు వెళ్ళిన మనిషి కాదాయె. ఇల్లు-వంటిల్లు

## నేనంటే ?



## ముసలితనం

ఒకసారి ఓ మిత్రురాలు చర్చిల్ భార్యను చూడటానికొచ్చింది. అప్పటికి లేడీ చర్చిల్ వయస్సు అరవై పైబడింది. అయినా కళ్ళ జోడు మాత్రం పెట్టుకోలేదు

ఆమె ఇబ్బందిపడటం గమనించిన మిత్రురాలు అంది.

"మీరు కళ్ళజోడు ఉపయోగించకూడదూ."

"వాడొచ్చు; కానీ జోడు పెట్టుకుంటే ముసలిదానిలా కనబడతానంటారు మావారు" అంది లేడీ చర్చిల్.

-డి. సత్యమూర్తి (అమలాపురం)

తప్ప మరో విషయం తెలియదు అమ్మకు. ఈ వయసులో వొంటరిగా ఎలా వదిలేస్తాం చెప్పు? నా ఉద్దేశ్యం మన ముగ్గురిలో ఎవ్వరో ఒక్కరం అమ్మను తీసుకెళ్ళటం క్షేమం." నా ఉద్దేశ్యం చెప్పేశాను.

తమ్ముడు శేఖర్ ఏం మాట్లాడలేదు. నేను చెప్పిందే సరైందన్నట్లు సపోర్టింగా తలాడించాడు.

నేను చెప్పిందానికి, అన్నయ్య 'ఏమనుకున్నాడో ఏమో, "సరే ఆలోచించి సాయంత్రం ఏ విషయం చెప్తాను."అంటూ వెళ్ళిపోయాడు.

అన్నయ్య 'ఆలోచించి' అన్నాడంటే, స్వతంత్రంగా ఆలోచిస్తాడనికాదు. వదినతో మాట్లాడి చెప్తాదన్న మాట. అన్నయ్యకు గైడు-డ్రైవింగ్ ఫోర్సు వదినే. వదిన కూడ ఉద్యోగం చేస్తుంది. అన్నయ్యతోపాటు సమానంగా సంపాదిస్తుంది. అందుకే ఆమెకు సమాన హోదా కల్పించాడు అన్నయ్య. ఏ నిర్ణయానికైనా యిద్దరి ఆమోద ముద్ర పడందే బిల్లు పాసుకాదు.

"నాకైతే ఏ అభ్యంతరం లేదు. ఎటొచ్చీ ఒక్కటే సమస్య. ఇటు నేను- అటు మీ వదిన ఇద్దరం ఆఫీసుకు వెళ్ళిపోతే, ఇంట్లో అమ్మ ఒక్కటే మిగిలిపోతుంది లోన్లీగా వుంటే అమ్మ ఫీలవుతుందేమొ. పోనీ ఒకలా చేస్తే? మీలో ఎవ్వరైనా అమ్మను తీసుకెళ్తానంటే చెప్పండి. ఇంటి మీద వచ్చే అద్దె మీరే తీసుకుందురుగాని. పైగా నేను కూడా నెలకో వంద పంపిస్తుంటాను." అన్నయ్య ఆలోచించి చెప్తానన్నది ఇలా చెప్పేడు.

"ఏరా తమ్ముడు ఏవిటి నీ ఉద్దేశ్యం?" అన్నాను శేఖరం వంక తిరిగి.

వాడికి పెళ్ళై రెండో సంవత్సరం. ఇంకా పిల్లల్లేరు.

"పోనీ తలా రెండు నెలల వుంచుకుందాం" అన్నాడు తమ్ముడు

పాపం వాడికి భయం వేసినట్లుంది. ముసలి తల్లి పర్మనెంటుగా ఒకళ్ళ దగ్గరే వుండిపోతుం దేమోనని.

"అమ్మ ఎవరి దగ్గరున్నప్పుడు వాళ్ళు ఇంటి అద్దె తీసుకోవచ్చు. మిగతా ఇద్దరూ నెలకో వంద అమ్మ కర్చుల కోసం పంపిస్తుండొచ్చు." శేఖర్ ఇన్ కంటిన్యుయేషన్ ఆఫ్ తన అభిప్రాయం మళ్ళీ అన్నాడు.

తమ్ముడు చెప్పిన ప్రకారమైతే అమ్మను, కొడుకులు ముగ్గురం పంచుకోబోతున్నాం అన్న మాట

రెండేసి నెలల చొప్పున.

తొమ్మిది నెలలు కడుపున మోసి, పాలిచ్చి పెంచి పోషించిన అమ్మను రెండేసి నెలలు చొప్పున పంచుకోబోతున్నాం

ఒక కొడుకు దగ్గర రెండు నెలలు పూర్తి కాగానే, అమ్మ పెట్టె, బిషాణా సర్దుకుని మరో కొడుకు దగ్గరకు ప్రయాణమైపోవాలి. ఆలస్యం పనికిరాదు. డ్యూడేట్‌కి డిస్పాచ్ అయిపోవాల్సిందే. గ్రేస్ పిరియడ్లు వుండవు. అగ్రిమెంటంటే, అమ్మైతే మాత్రం ఎక్కువా? ఎటొచ్చీ ఒక్కటే సందేహం అన్ని నెలలకూ రోజులు సమానంగా వుండవుగా. ఒకటి రెండు రోజులు ఎక్కువ తక్కువ వుండటం వల్ల ఏం గొడవలు జరగవు కదా!

నయం. అమ్మ ముగ్గురు కొడుకుల్నే కన్నది. మరో ముగ్గుర్ని కనుంటే అమ్మ శేష జీవితంలో సగభాగం ఒక కొడుకు దగ్గర నుండి మరో కొడుకు దగ్గరకు ప్రయాణమై వెళ్తుండటానికి, రైలు పెట్టెల్లోనే గడిచిపోయేదేమొ!

తమ్ముడికి భలే అయిడియానే వచ్చింది.

అమ్మపోయాక తలకొరివి పెట్టేది వాడే.

తండ్రికి పెద్దకొడుకు.

తల్లికి చిన్నకొడుకు.

పోయాక తలకొరివి పెట్టటానికి అర్హులట.

ఎటొచ్చీ. అటు పెద్ద - ఇటు చిన్న కాక, ఇద్దరికీ మధ్యనున్న నేనే ఎందుకు పనికిరానివాడనన్న మాట తల్లిదండ్రులకు.

కొడుకుగా పుట్టి, కొడుకుగా పొందవల్సిన అర్హత లేని వాడినా?

"నోనో...నో"

పెద్దకొడుకు- చిన్నకొడుకు, తండ్రి-తల్లీ పోయాక వాళ్ళ బాధ్యతల్ని నిర్వహిస్తుంటే, మధ్యముడు వాళ్ళు బ్రతికుండగానే నిర్వర్తించాలన్నది అందులోని ఉద్దేశ్యం.

అదే నా ఉద్దేశ్యం.


ఆ నా ఉద్దేశ్యమే అన్నయ్య తమ్ముడికి తెలియపర్చాలి.

అన్నయ్య, తమ్ముడు చెప్పటం అయ్యాక, ఇక మాట్లాడే టర్న్ నాకొచ్చింది.

నేనేం చెప్తానో అని అన్నయ్య, తమ్ముడు నావైపే సీరియస్‌గా చూస్తున్నారు.

"పోయినేడు అమ్మ హైద్రాబాదు వొచ్చింది మీకు తెలుసుగా అప్పుడు నాదగ్గరున్న పదిహేను రోజుల్లో ఆమె ఆరోగ్యంలో చాల మార్పు వొచ్చినట్లయ్యిందట. "మీ ఊరినీళ్ళు- వాతావరణం నాకు పడినట్లున్నాయ్ అబ్బాయ్" అంది. అమ్మకు ఆస్త్మా వుందికదా. హైదరాబాద్‌లో నాకు తెలిసిన మంచి హోమియో డాక్టరున్నాడు. అక్కడుంటే అమ్మకు మంచి ట్రీట్‌మెంట్ దొరుకుతుంది. అమ్మకూడ ఆ వాతావరణం

కావాలి



పడిందన్న నమ్మకం వుంది. అందుకే అమ్మను పర్మనెంటుగా నాదగ్గరే వుంచుకుంటాను. ఎప్పుడైనా మీదగ్గరకు రావాలనుకుంటే వచ్చి చూసి వెళుతుంది. అయితే మీరెవ్వరూ నాకేం డబ్బు పంపవల్సిన అవసరం లేదు. ఇంటిమీద వచ్చే డబ్బు అమ్మే తీసుకుంటుంది. కూతుళ్ళకే ఇచ్చుకుంటుందో, మనవలకే ఇచ్చుకుంటుందో ఆమె యిష్టం" అన్నాను.

అన్నయ్య, తమ్ముడు ముఖాల్లో అప్పటివరకు ఉన్న టెన్షన్ తగ్గి రిలీఫ్ కన్పడింది.

"బాగుందిరా. బాధ్యతనంతా నువ్వే తీసుకుంటానంటే ఎలా? చూసేవాళ్ళు ఏమనుకుంటారు? అయినా, అమ్మ ఎక్కడుంటే అక్కడకు ఆడపిల్లలు వస్తూపోతూ వుంటారు. పండగలకని-పురుళ్ళకని. నువ్వొక్కడివే రద్దీ తట్టుకోవటం కష్టం" అన్నాడు అన్నయ్య.

"లేదన్నయ్యా. ఈ ఒక్క విషయంలో నా మాట కాదనకు. ఎక్కడున్నాసరే అమ్మకు ఏలోటు రాకుండా చూసుకుంటున్నంత కాలం ఎవరేం అనుకున్నా మనం లెక్క చేయవల్సిన అవసరం లేదు. మనందరికోసం అమ్మ ఎంత కష్టపడిందో, ఇప్పుడు ఆమెకు వయసు మళ్ళింది. ఆమె బాధ్యతలు మన మీద వేసుకోవాలి తప్పదు." అన్నాను.

ఇన్నేళ్ళుగా నివాసం ఉన్న ఆ ఇల్లు వదిలి రావటానికి అమ్మ చాలా బాధ పడింది. ప్రక్కన అద్దెకుంటున్న వాళ్ళే రెండు పోర్షన్లు తీసుకుంటామన్నారు. ఇంటిమొత్తానికి అద్దె నెలకు మూడొందల ఏభైకు ఖాయంచేసి, ప్రతీనెల అమ్మ పేరున డ్రాఫ్టుపంపే ఏర్పాటు చేసి, అమ్మను బయల్దేరదీశాను.

అమ్మ నాదగ్గరకొస్తుందంటే నాకు లాటరీలో లక్షలు దొరికినంతగా సంబరపడిపోయాను. ఆ క్షణంలో నాకు, చిన్నతనంలో ఒకసారి, అమ్మ, నాన్నతో అన్నమాటలు గుర్తొచ్చాయి.

"పిల్లలెవ్వరికీ పట్టదుగాని, వాసుగాడికి మాత్రం అమ్మ ఏం తిందోలేదోనని ఊరికే ఇదైపోతుంటాడు. వాడిది చాలా మంచి మనసండీ. ఎప్పటికైనా వాడే మనల్ని చేరదీసి చూస్తాడన్న నమ్మకముండీ నాకు"

అమ్మ ఏ ఉద్దేశ్యంతో అన్నా, ఆమె మనసులోని భావాలకనుగుణంగా ఈ రోజు నాకా అవకాశం దొరికటం ఎంతో అదృష్టం అనిపించింది

ట్రైన్‌లో బెర్త్ మీద అమ్మ ప్రశాంతంగా నిద్రపోతుంటే ఇన్నేళ్ళుగా శారీరకంగా-మానసికంగా అలసిపోయిన ఆమెకు సంపూర్ణ విశ్రాంతి లభించినందుకు నాకు ఆనందంతో కళ్ళు చెమర్చగా, ఎవరైనా చూస్తారేమోనని రెండు చేతుల్తో కళ్ళు మూసుకున్నాను.

---

ఆంధ్రభూమి
సచిత్రవారపత్రిక

## సరికొత్త ఫీచర్

# నిరుద్యోగ విజయాలు

ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎన్ని పథకాలు వచ్చినా నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరుగుతుందే గాని తరగడం లేదు. ఎమ్బియ్యే చదువుకున్న యువకుడు ఒక హోటల్‌లో 'స్టువర్డ్'గా పని చేస్తున్నాడు. బియ్యే చదువుకున్న యువకుడు వేరుసెనక్కాయలు అమ్ముకోవడం గొప్పగా భావిస్తున్నాడు. బాగా చదువుకుని జీవనభృతి కోసం ఏదో ఒక వ్యాపకం పెట్టుకొని ఎప్పటికయినా ఉద్యోగం దొరక్కపోతుందా? మంచిరోజులు రాకపోతాయా? అని చాలమంది ఎదురు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారు.

**అటువంటి నిరుద్యోగులను దృష్టిలో వుంచుకుని ఒక సరికొత్త ఫీచర్‌ను ఆరంభిస్తున్నామని తెలియజెయ్యడానికి సంతోషిస్తున్నాము.**

నిరుద్యోగులు తమ పాస్‌పోర్టు సైజు ఫొటోతో పేరు అడ్రసు వ్రాసి ప్రస్తుతం చేస్తున్న పని వివరాలు పంపిస్తే వరసగా ప్రచురిస్తాము. మీ వయస్సు? ఏం చదువుకున్నారు? ఏ ఉద్యోగం అంటే ఇష్టం? కూడా రాయాలి.

**అదృష్టం బాగుంటే మీ మీ క్వాలిఫికేషన్‌లకు తగిన ఉద్యోగం ఇవ్వడానికి ఎవరయినా ముందుకు వచ్చినా వస్తారు. ప్రయత్నించండి.**

కవరుమీద 'నిరుద్యోగ విజయాలు' ఎడిటర్ ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 36 సరోజినీదేవి రోడ్డు, సికిందరాబాద్ 500003 అని రాయాలి